# 'మా విద్విషావహై'

(రేఖా చిత్రం)

*

= శ్రీ హనుమచ్ఛాస్త్రి =

పగలు...ఒంటిగంట—

వార్తలు మోసుకువచ్చే పొడుగాటి కాగితాలు...నురుగులు కక్కుకుంటూ పరుగెత్తుకువచ్చి...ఎదుట...నించున్నాయి.

తేరి చూశాను.

కళ్లు భగ్గుమన్నాయి.

అంతే.........

అడ్డంగా...నిలువుగా—

రెక్కలు తొడుక్కున్న క్రౌర్యంలా—

బాకులు...ఎగురుతున్నాయి.

'ధన్...ధన్...ధనా'

తుపాకులు పేలుతున్నాయి.

చుట్టూ తుపాకిమందు...క్రూరవాసన.

ఎగిరిన పాగాలు—

ఇగిరిన గొంతుకులు—

చిదికిన గడ్డాలు—

విచ్చిన గుండెలు—

తిరిగే కన్నులు—

ఒరిగే దేహాలు—

పాలరంగు పాపలబుగ్గల్లో...

ఏనుగుదంతపువన్నె ఆడపడుచు...వక్షంలో...

బాకులు గుచ్చిన నెత్తురు...

బుసబుసలు...

అన్నిటిలోంచీ ఒక్కటే రంగు... నెత్తురు...

దిక్కుమాలిన రక్తానికి ... వర్ణ భేదం లేదు గాబోలు!!

అరరే—

చూశావా!

అన్ని కళేబరాల గాయాలూ...ఒకేఒక్క ఆఘాతమై...ఆ తల్లి దేహవల్లి నుంచి...ఎట్లా...రక్తపు ధారికలుగా దిగజారుతున్నాయో—

అయ్యో!—

తలమీద బలమైన లాఠీ విరిగింది.

కళ్లల్లో చీకట్లు—

అల్లా!

అల్లా, చూడు.

***

మూడువందలేళ్లు—

వెనక్కి ఒదిగిఒదిగి తప్పుకున్నాయి.

అద్భుతపరిమళాలు వెదజల్లే...అగరుపొగ—

పల్చని నల్లకలువరేకురంగు సొగసుతీగలుగా సాగి...ధూమకరండకం నుంచి లేచి...ప్రాంతభూమిని మత్తులో ముంచుతూన్నది.

ఆ చంద్రశిలా మహారాజప్రాసాదంలోకి...నడువు...భయం లేదు.

భారతచక్రవర్తి మహేంద్రవైభవోపేత సభాభవనంలో...కాలు పెట్టు.

గోడలమీద శిల్పాల్లో నిలిచి...రంగురంగు ఈరెండలు కాసే పద్మరాగగోమేధికమాణిక్యాల వెలుగుకు కళ్లను సర్దుకుని...నెమ్మదిగా ముందుకు కదులు—

వజ్రాల అంచులతో మరకతాల తరులతాది మధ్యచిత్రాలతో ధగధగ మెరిసే...విశాల రత్నకంబళం మీద...

తెల్లపట్టు మస్‌నద్‌ను ఆనుకొని...

శ్రీ షాజహాన్ చక్రవర్తి—

పక్కగా—

చక్రవర్తి ప్రియపుత్రుడు...దారాషుకో...

కావ్యకళాప్రియుడు...

చక్రవర్తి...చిటికెనవేలి నీలపు ఉంగరం ... చరాలున మెరిసేలా ... సవిలాసంగా ... హుక్కా అందుకుని...రెండుగుక్కలు పీల్చి...సన్నజాజుల...కటుగంధధూమలతలను నెమ్మదిగా ఊదుతున్నాడు—

మంత్రి సామంతాదుల...ఉమ్కరాజనీతి...ఎగయని శాంతసుభగవాతావరణం.

ఆ విశాలసభాభవనంలో—

మూడవ సభ్యుడు—

ఒక మధురశ్రోత్రియమూర్తి—

మేలిమిబంగారపు తీగతో చుట్టిన...రుద్రాక్ష తావళంలోని...వజ్రం...అతని మెడమీద...ధగధగ మెరుస్తున్నది.

చల్లని శ్రీరాగంతో...

మెల్లగా...అందుకున్నాడు.—

తదవధి కుశలీ...

పురాణశాస్త్రస్మృతిశతచారువిచారజో వివేకః

యదవధి న పదం దధాతి చిత్తే

హరిణకిశోరదృశో

దృశో ర్విలాసః.

"అచ్ఛా...బహుత్ అచ్ఛా"

ఆకవితామాధుర్యానికి...ఉద్యరత్నచిత్రాలు...కిలకిలమన్నాయి.

సౌధోపరిభాగంలోని...గులాబీ మేలిముసుగుల మృదుకంకణనిక్వాణం ముఖరితమైంది—

ఫాదుషా...పెదవివద్దకు తెచ్చిన హుక్కా...ఆపి...

మహాకవీ!

జగన్నాథా!

పండితరాజా!

మూగవోయిన ఈ రంగురాళ్లు కావు...మా సభాభవనరత్నాలు—

మీరు మా సభామందిర...దివ్యరత్నం!

తన చేతులతో...మహాకవిచేతులను... ఆప్యాయంగా అందుకున్నాడు.

తళతళమనే రెండు ఆనందాశ్రువులు... మొగల్ సార్వభౌముని...కళ్లల్లో...మెరిసి చెక్కిళ్ల మీదుగా జారాయి.

* * *

"ఏతీరున నను దయజూచెదవో

ఇనవంశోత్తమ రామా!

నా తరమా........."

జైలుగోడలు జాలితో చెమర్చాయి.

అతని విశ్వాసానికి...జైలుతలుపు...ఉక్కు ఖడ్డీలు నిశ్వసించాయి. కాని—

ఆడ బ్బెవరిది ?

అధికారదుర్వినియోగం —

............

కాదులే—

అంధవిశ్వాసం.

............

తప్పు

............

ఆత్మత్యాగం.

నవాబుధనంతో...కాఫిర్ గుడిగోపురాలు...

కదూ ?

తహసీల్‌దారుతల...ఎగిరిపోతుంది.

పాపం—

............

"ఖోలో"

"...దర్వాజ్ ఖోలో—"

కారాగారపు ఉక్కుతలుపులు...లోభిపిడికిలిలా...బద్ధకంగా తెరుచుకున్నాయి.

"గోపన్నా...భాయీసాబ్ !"

"ప్రభూ, ప్రభూ, వచ్చావా ?...రామా !

నయనాభిరామా !

పట్టాభిరామా !

దయచేశావా ?...ఇప్పటికి"—

"గాభరా వద్దు...భాయీ !

నన్ను చూడండి—

గోల్కొండ...

మీమీద వాదులు...విని బందీలో వేశాం."

"ప్రభువులు...తల తీయించండి. నా భద్ర మూర్తిని...త్వరగా చేరుకుంటాను."

"తొందరవద్దు...

తప్పులు చెయ్యడం ఎంత సహజమో, దిద్దుకోవడం అంత సులభం—

ఆలుబిడ్డలకోసం...మీ భోగంకోసం ... చెయ్యలేదు. నిజం.

అల్లా ఆజ్ఞ ...

మీ చేతిమీదుగా ఖర్చుపడింది.

ఫర్వాలేదు.

మీరు కట్టించిన గుడి అందం చూశాను.

కాఫిర్ ద్వేషం లేదు. ఖుషీ కలిగింది.

ఇక మీకు స్వేచ్ఛ...

మీ రాముడిలో అల్లాను...చూస్తాను."

............

బందిఖానా ...హఠాత్తుగా...భద్రాచల...... రామాలయం.

శ్రీరామనవమి...గర్భాలయపు గంటలు...

అమోఘంగా...మోగుతున్నాయి.

చిరునవ్వుతో...వింటూ

ఎదుట...నిలిచిన...

గోల్కొండనవాబు—

తానీషా !

***

అదిగో—

నిషాపురి !

పారశీక సుందరసీమలు—

ఆ ఉద్యానంలో...విరియబూసిన ... కొమ్మలతో ఊగే గులాబిపొదలవద్ద...

ఎవరు వారు ?

తెల్లని అంగరఖాలో... మెరిసే...

పండుతమలపాకు రంగు......పచ్చని...శరీరం.

పండిన గడ్డం.

విజ్ఞాన సీమల్లా...విస్తరించిన...రెండునేత్రాలు.

లోకాతీత సుందరానుభూతులు...చూపించే... రెండుదీపాలు.

............

ఒక పద్యాల పుస్తకం—

ద్రాక్షారసంతో...నింపిన...రెండు కూజాలు.

ఒక సరకం—

ఎదుట—

............

"అచ్ఛా—

స్వేచ్ఛాజీవీ !"

............

ప్రక్క—

కూజా సవరించి...అమృతం వడ్డించే పారశీక మోహిని...

ఆమె చక్కని నేత్రాల నీడలతో...ఆ మధువు మరీ మత్తుగా తియ్యగా ఉందా ?

సాఖీ !

ఆ మోహిని...

కోటిమొగలిపూల నునుపుతో పొంగే వక్షం అతని మీదకు వంచి...ఇంకొక చషకం మధువునింపి... అమరమాధురులు ఒలికించే అతని పెదవులకుఅందించి—

నవ్వింది.

అతడు—

తెల్లని ఆమెనవ్వును—

ఎఱ్ఱని మధువును...
త్రాగి...మైకంతో కన్నులు అరమోడ్చి...
"అచ్చరవంటి నెచ్చెలి...
రసాంచిత కావ్యము.
కెంపు పానకంబు...
ఇచ్చుగ...ఆమనిం దొరకనేని...
మసీదుల గుళ్ల దాస్యమున్—
మెచ్చక—
ముక్తులై —
సుఖముమీర చరింతురు...
జాగరూకులై..."
..............
"భేష్...భేషక్"
..............
ఎవరు వారు ?
పూర్వం—
నిషాపూరు ఉండి చెరిగిపోయిన చోటు—
ఒక విశాలజీర్ణోద్యానం—

ఏవేవో పర్షియాముసలిచెట్లు...ఎత్తుగా పెరిగి ముసురుకొనే జ్ఞాపకాల బరువుతో...నెమ్మదిగా... తలలు కదుపుతున్నాయి.

చల్లని చెట్లనీడల్లో...బతికినవాడు భరించలేని నిశ్శబ్దమృత్యుశైతల్యం—

ఎదుటిగోడను ఆనుకొని...ఒక జీర్ణమైనసమాధి-

గాలికి కదలే ఉన్నతవృక్షాగ్రాలనుంచి...

చెట్లను పెనవైచుకున్న తీగలకొనలనుంచి... ఉండిఉండి ఆకులూ...పూలూ...

ఆ సమాధిమీద రాలుతున్నాయి.

నలుగురు—

ఆధునికభారతీయకవులు—

స్విన్న వదనాలతో...ఆర్ద్రనయనాలతో ఆ సమాధిముందు...చేతులుమోడ్చి...నిలుచున్నారు.

ఒక గొంతు...

ఆ మృతనీరవప్రకృతికి...ఊపిరి కల్పిస్తూ, పలికింది—

..............
"ఓయీ ఉమ్రఖయాము!
నీవు చని ఎన్నోఏండ్లు పూండ్లాయె;
లే బ్రాయంపుం జెలి సాఖియున్—
ధరణి గర్భంబందు నిద్రించె;
గుర్తే యాపట్టిక నీ నిషాపురము...
జీర్ణించెం గదా!.
నీదు గోరీయైనన్ సడలున్,
రుబాయి తోకచే...
సృత్యత్యంకమై నిల్చెడున్."

*   *   *   *

ఎక్కడి పారశీక దేశం ?
ఎక్కడి భారతీయ సీమలు?
ఏ హృదయానురాగ బంధం–
ఇద్దరినీ...కలిపిందో—

***

గ్రామంలో రంజాన్ పండుగ—బ్రహ్మాండంగా జరుగుతున్నది.

వాడవాడలా...హిందూ పులులు ... ముసల్మానుల్లో...ములిగి చెలగి ఆడుతున్నాయి.

పీర్లకు దండంపెట్టుకున్న అమాయికపు పేరంటాళ్లు...పసుపు కుంకాలు, పళ్లు......మొక్కుబడి చెల్లించి మరలుతున్నారు.

విద్యాలయానికి వెడుతూ...మసీదు దగ్గరికి వచ్చాను.

రంగు చెమ్లాలు...

ఫెజ్ టోపీలు—

అంగరఖాలు—

ముస్లిం యువకులు...

ఉత్సవంగా ... ఉత్సాహంగా ... ఎదురువస్తున్నారు.

మసీదులోంచి ... మంచిరకం అగరొత్తుల... వాసన...గాల్లో కలిసి సుఖంగా ఒస్తోంది.

హఠాత్తుగా...కల్లోలం...

చిటికెలో పెద్దధూళి...

ధూళిని మించిన కేకలు...

అలజడి...అల్లరి.

కారణం తెలియదు...

పదులు...వందలు...దిక్కు తెలియని ధూళిలోకి పరుగెత్తుతున్నారు.

లాఠీల టకటకలతో ... చెవులు చిల్లులు పడుతున్నాయి.

ఆక్రోశాలు ... హాహాకారాలు...

కోపాలు...శాపాలు...

పాగాలు...ఎగిరాయి.

టోపీలు...చిదిగాయి.

ధూళితెర...భయంకర జాతిద్వేషంలా ఆకాశానికి లేచింది.

తలవని తలంపుగా...

కల్లోలంమధ్య...నేను.

తెర కవతలనుంచి ఒక జనప్రవాహం...

ముందుకు దూకుతున్నది.

మసకలో...

దృశ్యాదృశ్య...

పరిచిత...

ముస్లిం యువకులు...

ముగ్గురు.

మస్తాన్ —

మహబూబ్ —

రహిమాన్ —

........................—

చరాలున...ఒక బాకుచేయి...ధూళిని చీల్చుకొని...నా గుండెకు సూటిగా...వచ్చింది.

బాకు పిడికిలివెనక—పచ్చని షెర్వాణీతో—దూసుకువచ్చే శరీరం...దగ్గరకు వచ్చింది—

"మస్తాన్!"

కెవ్వున అరిచాను.

ఎదుటికళ్లలోని ఎరుపు తెల్లబోయింది.

గొంతు ఒణికింది.

"మాస్టరు సాబ్!!"

"ఇదిగో...గుండె...ఆలోచించకు. నీ చెయ్యి మంచిది."

ఎదిరిని దహించే చిరునవ్వు—

"మీరా!"

పాపం. తడికళ్లు తుడుచుకుంటున్నాడు.

రెండు లాఠీలు...తలదాకా...వెళ్లి ... హఠాత్తుగా...ఆగాయి.

గట్టిగా నవ్వాను.

"కానీండి"

"నమస్కారం, నమస్కారం."

"పిచ్చివాళ్లు..."

గట్టిగా కౌగలించుకున్నాను.

"సహనా వవతు—

మా విద్విషావహై"

కిలకిల నవ్వారు.

*　　*　　*　　*

కళ్లు విప్పాను.

భారతపటం నుదుటిమీద—

గాడినగాయాల్లోంచి—

వేడివేడి నెత్తురు చుక్కలు...